# వీడేం మొగుడండీ బాబూ?

దళారీలతో ప్రమేయం లేకుండా... లంచం ఇచ్చుకోకుండా ... రికమండేషన్ లేకనే టెస్ట్ ఎక్జామ్ రాసి డైరక్ట్ ఆఫీసర్ పోస్ట్‌కి సెలక్టైనాడు సదానందం!

సదానందం బ్రిలియంట్! చదువుకునే రోజుల్లో స్కూలు... కాలేజి ఫస్ట్! ర్యాంకు హోల్డర్! కనీసం ట్యూషనుక్కూడా వెళ్లలేదు. టీచర్లు... లెక్చెరర్లు చెప్పేది ఆకళింపు చేసుకుని స్వయంకృషితో ఆఫీసరవగలిగేడు. పడ్డ శ్రమ సదానందాన్ని అందలం ఎక్కించింది!

పేరులో ఉన్న ఆనందం సదానందంలో అవుపించదు. మనిషెప్పుడూ సీరియస్‌గా వుంటాడు. మిత భాషి! పోచికోలు బుర్లంటేనే గిట్టదు. పొయ్యి మీద పెనం లాగ ముఖం నిత్యం మటమటలాడుతూంటుంది. టార్చి లైట్ వేసి పరికించినా ముఖాన నవ్వనేది కన్పించదు. అది అతగాడి స్పెషాలిటీ!

ఇంట్లో టి.వి ప్రోగ్రామ్స్ వీక్షిస్తున్నా... కామెడీ సన్నివేశాలొచ్చినపుడు ఇంటిల్లిపాది పొట్ట చక్కలయ్యేట్టు నవ్వుతున్నా మనిషి విసుక్కుంటాడు.!

సెటైర్లు... వెటకారాలు సదానందం వంటికి పడవ్! పెళ్లి చూపులప్పుడు... అమ్మాయిని చూచి కొయ్యలాగ బిగుసుకున్నాడేగానీ... పెదాలపై నవ్వు తాండవించలేదు.

సదానందం పరిస్థితి వోరకంట చూచిన పెళ్లి కుమార్తె 'వీడేం మనిషండీ బాబూ?'- అనుకున్నా... కుర్రాడు ఎర్రగ బుర్రగా వుండటాన అబ్బాయి నచ్చినట్టు తలాడించేసింది.

ప్రభావతి పి.జి చేసింది. ఎప్పుడూ నవ్వుతూ జోక్స్‌వేస్తూ సరదాగా వుండే స్వభావం!

పది నిముషాల్లో పెళ్లి చూపుల తంతుపూర్తైంది. మగపెళ్లి వారి బంధువర్గం పిల్లనచ్చినందుకు సంబరపడుతూ వెళ్లిపోయారు.

ఇతనేం పెళ్లి కొడుకు? తనను పక్కకు తీసుకెళ్లి కాసేపు తనతో వంటరిగా మాట్లాడతాడేమోని ఆశపడింది ప్రభావతి. తన ఆశ నిరాశే అయింది.

సదానందం గురించి ప్రభావతితో అనేకానేక 'డౌట్లు' వుత్పన్నమైనయ్!

అతగాడు నోరు తెరచిమాట్లాడకపోవటం చూచి నత్తి ఏమైనా వుందో ఏమో అన్పించక పోలేదు. ఒక మాటలేదు... పలుకు లేదు!.... నవ్వు లేదు సరదా లేదు! మర బొమ్మలా బిగుసుక్కూర్చోవటం గమనించి నివ్వెర పోయింది. స్వతహాగ మనిషి మిత భాషా?... లేక మరేదైనాకారణం వుండి వుంటుందా?- ఏదీ అర్థం కాలేదు. అయినా కుర్రాడు నచ్చటంతో తలాడించి తన అంగీకారాన్ని తెలయజేసింది.

పెళ్లి చూపులకు ఫుల్‌సూట్‌లో వచ్చిన సదానందాన్ని చూచి మురిసి ముగ్ధురాలైంది ప్రభావతీ. తను బాగా ఇంప్రెసైంది.

పెళ్లిపీటల మీద కూర్చున్నక్షణం నుండి సదానందాన్ని నిశితంగ గమనిస్తునేవుంది ప్రభావతి! తనవైపు క్రీగంట చూచినట్టే లేదు. చిరునవ్వులొలికిస్తూ చిలిపిగ చూడటం అంతకంటే లేదు.

తలంబ్రాల సమయంలో మనిషిలో హుషారే లేదు. నీళ్ల బిందెలోంచి ఉంగరం మట్టెలు వేసి వధూవరులను పోటీపడి వాటిని బైటికి తియ్యమని పురోహితుడు ప్రోత్సహించినా... చుట్టూ మూగిన వారంతా కేరింతలు కొడుతున్నా... ఇరువురి చేతులు బిందెలోకి జొప్పించినపుడు భర్త తన చేతులను గిల్లటం గిచ్చటం వంటి చిలిపిపన్లే చేయక పోవటం చూచి నివ్వెరపోయింది.

గృహప్రవేశ సమయంలో గుమ్మంవద్ద నిలిపేసి ఒకరి పేరు మరొకరిని చెప్పమని ఆడంగులు బలవంతం చేసినా ఎవరికీ విన్పించనంత తగ్గు స్థాయిలో భార్య పేరు చెప్పాడు.

శోభనం నాటి రాత్రిగాని... మొగుడు ఎలాంటి వాడో ప్రభావతికి సంపూర్ణంగా అర్థమై ఏడవలేదు. ఇరువురివి భిన్నమైన మనస్తత్వాలని... అభిరుచులు కూడా వేరని బోధపడినా ప్రభావతి బాధపడలేదు. తప్పు చేశానేమోని కుళ్లి కుళ్లి ఏడవలేదు. క్రమేణా భర్తతో మార్పు చూడకపోతానానే ఆశలో వుండిపోయింది. మనసుకు సర్ది చెప్పుకంది.

భర్త చొరవతో మాట్లాడకపోవటం... పాలు పళ్లు స్వీట్లు షేర్ చేసుకోనందున మనసు బాధకు లోనైనా మనసులో భావాన్ని బైటపడనీయలేదు. కానీ... తన మనసు ఆవేదనకు గురైంది.

భర్తకు అసలు సరదాలే లేవా? లేదా..వేరెవరినైనా లవ్ చేసి... విఫలమైన

కారణాన తనను వివాహమాడేడా?... అయిష్టంతో తన మెడలో తాళి కట్టాడా? ఏదీ అర్థం కాకుండా వుంది

భర్త బుద్ధావతారం దాల్చటం ప్రభావతిని బాధిస్తోంది. పోనీ తానే 'లీడ్' తీసుకుని చొరవగా ప్రవర్తిస్తే? అమ్మో!... తాను ఆడదీ. తనకు తానుగ ముందడుగు వేయటం ప్రమాదంగా తోచింది. అపార్థాలకు తావిచ్చినట్టవుతుంది. భార్య బరితెగించిందనే నింద తానుమోయాల్సి వస్తుందేమోని జంకింది!

నూతన వధూ వరులిరువురూ ఎవరి మనసులో వారు తర్జన భర్జన పడసాగారు.

పెళ్లి చూపులనాడు ఫుల్ సూట్లో చూడగానే ఇతడే తన భర్త అయితే... శృంగార పురుషుడౌతాడన్పించక పోలేదు. తీరా గదిలోకొచ్చాక తన ఆలోచనలు తల్లకిందులైనయ్. మౌన ముద్రతాల్చి భర్త శుద్ధ బుద్ధావతారంగ బిహేవ్ చేయటం ప్రభావతికి బొత్తిగ నచ్చలేదు.

ప్రభావతి మనసులో తెలియని బాధ.. దిగులు వున్నా పైకి నిబ్బరంగ వుండక తప్పలేదు.

ఓ నరవరా! గ్లాసులో పాలు గ్రోలరా!... నను బ్రోవరా... అని మనసులో అనుకుంటూ చేతిలో పాలగ్లాసు అందించింది.

'పాలు తాగను... నాకు ఎలర్జీ...! ఎట్టకేలకు సదానందం నోరు విప్పి మాట్లాడాడు.

'హమ్మయ్య!- ఎట్టాగైతేనేం నా మొగుడు నోట్లోంచి జవాబు వూడిపడ్డది. సైలెన్స్ బ్రేక్ అవటంతో ఇక పట్టాల మీద ముందుకు సాగచ్చని ఆశపడింది ప్రభావతి.

'పోనీ... స్వీటైనాతిందురూ...' జాంగ్రీ చేతిలోకి తీసుకుని భర్త నోటికి అందించబోయింది.

'స్వీటు నాకు సరిపడదు...'! మారం చేసే పిల్లాడిలా రహస్యం చెప్పినట్టు మాట్లాడేడు.

'పడదా? ఏం? షుగర్ పేషెంట్వా కొంపదీసి'? ఠక్కున అనేసింది.

'కళ్లు మండుతున్నయ్! నాకు నిద్ర వచ్చేస్తోంది. ఆవలింతలొస్తున్నయ్. పెళ్లి కాకముందే ఎనిమిది కొట్టే సరికి కునుకుతీసి గురుక పెట్టే వాడిని! ఇప్పుడేమో

శోభనం రాత్రి అంటూ నన్ను తెగ ఇబ్బంది పెట్టేస్తున్నారు...' బుంగమూతి పెట్టాడు.

'అదేంటీ? అప్పుడే నిద్రా?' అవాక్కైంది.

'శోభనం మూడు రాత్రులుంటుందిగా... ఈరోజుకు నన్ను నిద్రపోనీ... ఇబ్బంది పెట్టుకు పెళ్లామా? మంచంవెల్లకిలా పడుకుని కళ్లు మూసుకున్నాడు.

సూటు బూటు వేసుకుని ఎంచక్కా వుద్యోగం వెలగబెట్టే మొగుడికి ఇదేం పాడుబుద్ధి?- రంభలాంటి భార్య చెంతనుంటే అసలు ఈయన గారికి నిద్రెలాపడుతున్నది ఏం మొగాడివిరా మగడా?

భర్త లాల్చీ పట్టుకు నిద్ర లేపి ఆచంప ఈచెంప వాయించి నిన్ను నిద్ర పోనివ్వను. నా పర్మిషన్ లేకుండా నిద్రకుపక్రమిస్తే... నిన్ను గిల్లి గిచ్చి... జుట్టుపీకి... నానా యాగీ చేస్తా ఏమనకున్నావో అనాలనుకున్న ప్రభావతిని పిరికితనం ఆవహించింది. తాను ఆడది! అందునా భారతీయ మహిళ! భర్తను నిందించటం మహాపాపమే కాదు పతివ్రత లక్షణంకాదు. అందుకునే భర్త గుర్రుపెట్టి నిద్రపోతున్నా ఏక్షణానైనా లేస్తాడేమోనే ఆశతో తెల్లవార్లూ తల్లో మల్లెలు వాడిపోయినా పాపం మేలుకునే వుంది.

నీరసంగా తెల్లవారింది!

తలంటు స్నానం చేసి నీరెండలో నిలబడి కురులు ఆరపెట్టుకుంటున్న సమయంలో తోడికోడలు దగ్గరగా వచ్చి 'తెల్లార్లూ నిద్ర లేదా ఏం... కళ్లెర్రగా వున్నయ్' అంది కొంటెగ

'అంతసీను లేదులే అక్కా- మీ మరిది అపరకుంభకర్ణుడు. మంచం ఎక్కినప్పటినుండి ఒకటే నిద్ర...' కుండ బద్దలు కొట్టింది ప్రభావతి.

'నామరిది నోరులేని వాడమ్మా... పసివాడి మీద అభాండాలు వేయకు. నువ్వే కాస్త మచ్చిక చేసుకోవాలి...'

'అవునవును తాగలేడు... తిన్లేడు... సరసాలు ఆడలేడు... భార్యని దగ్గరకి తీసుకోలేడు... నిజంగా అమాయకుడే...' ఫక్కున నవ్వింది.

'కంగారుపడకు కొత్త కదా?... కుర్రాడు తొందర్లోనే దారి కొచ్చి నీ భరతం పడతాడ్లే!

తోడికోడళ్లిద్దరూ నవ్వుకుంటూ ఇంటిపనుల్లో మునిగిపోయారు.

రాత్రి ఎనిమిది గంటల సమయం!.. భర్త ఇంకా ఇల్లు చేరుకోలేదు. ఇంతలో సెల్ రింగ్ టోన్ విన్పించటంతో ఆన్ చేసి 'హలో' అంది ప్రభావతి.

'నేను సిస్టర్... పెద్ద తోడుకోడలిని... గుడివాడ నుంచి... అవునూ... రాత్రి నీ శోభనం కదా... నామరిది నిన్నూ నిద్రపోనిచ్చాడా? నిన్ను కొరుక్కు తినేశాడా?... చతురాడింది

'అయ్యోరామ- నా ముఖానికి అంతా అదృష్టం కూడానా?...'

'అదేంటి అట్లా అంటావ్?-'

'మా ఆయన వట్టి బుద్ధావతారం! బెదురుగొడ్డు! ఓమాట లేదు. పలుకు లేదు- గదిలోకి ఎంటరవగానే పడకసీను వేశాడు...'

'అదేంటి ప్రభావతీ? కుర్రాడు! పైగా వయసులో వున్నావాడు... నిన్ను కొండ చిలువ లాగ పెనవేసుకుంటాడని నేననుకుంటుంటే... నువ్వేంటి రివర్స్‌లో మాట్లాడుతున్నావ్?-'

'నేనేం అబద్ధం చెప్పటం లేదు. సిగ్గు విడిచి వాస్తవం మాట్లాడుతున్నాను...'

'మరిదిగారు కాస్త బిడియస్తుడు! మనిషి నిదానం దేనికీ తొందరపడే స్వభావం కాదు. అంచేత నువ్వు నిరుత్సాహపడద్దు! స్లో అండ్ స్టడీ విన్స్‌దిరేస్!. ఒక రోజు డిజపాయింటయినా... రాను రాను రెచ్చిపోయి నిన్ను ఇరగదీస్తాడు చూస్తుండు!...

నువ్వేన్నైనా చెప్పు అక్కా! ఆయనొట్టి టేస్ట్ లేని వేస్ట్ హాజ్బెండ్ అన్పిస్తోంది. రాత్రి సంగతలా వుంచు! పోనీ పగలైనా... నా చేత తలకు నూనె రాయించుకోడు. తలదువ్వించుకోడు. ఆఫీసు కెళ్ల బోతూ 'టై' నా చేత 'నాట్' వేయించుకోడు... వీధిలోకి వెళ్లి కనీసం టాటా అయినా చెప్పడు...! చిరుకోపంతో మాట్లాడి సెల్ ఆఫ్ చేసింది.

భర్త బిహేవియర్ బొత్తిగా నచ్చటం లేదు. ప్రభావతికి! అయినా ఓర్పు వహించక తప్పటం లేదు.

బెడ్‌రూమ్‌లో కొస్తే మనిషి బిగుసుకుంటాడు. పెదాలకు ఫెవికాల్ రాసుకున్నట్టు నోరు విప్పడు. ఓ అచ్చట.. ముచ్చట తెలియని మనిషి. అసలు మొగుడిలో సరదా అనేదే చూడలేకపోతోంది. ఇలాంటి భర్తతో కాపురం ఎలా

చేయటమాన్పిస్తోంది.

సహనం కోల్పోయిన ప్రభావతి ఒకరోజు మొగుడ్ని నిలదీసింది.

'మీ పద్ధతి బొత్తిగ నచ్చలేదు. భార్యాభర్తలు ఇలాగేనా వుండేతీరు?- మీరు చదువుకున్న వారు... సంస్కారంతులు! మీరంటే మోజుపడి... ఇష్టపడి.. మిమ్ముల్ని చేసుకున్నాను. మీరే నా సర్వస్వం అనుకుని మురిసిపోతున్న నాకు మీరిస్తున్నా ఆనందం సంతోషం ఇదేనా? వైవాహిక జీవితం పట్ల ఎన్నో తీపికలలు కన్నాను. ఊహల్లో విహరించాను. కానీ ఏం లాభం? నా ఆశలు నిరాశలు అయినయ్! మీకసలునేనంటే ప్రేమ లేదు. ఇష్టం లేదు...' ఎడాపెడా సదానందాన్ని వాయించి భోరున ఏడ్చింది.

అనూహ్యమైన భార్య ప్రవర్తనకు నిర్ఘాంతపోయాడు సదానందం.

'సారీ డియర్! నన్ను మన్నించు! స్వతహాగ నేను పిరికివాడిని! పైపెచ్చు మిత భాషినీ. దేనికి అంత త్వరగ రెస్పాండవను! అదే నా మైనస్ పాయింట్!- నాకళ్లేకాదు.... నీ మనసులో వ్యధ చెప్పుకుని నానోరూ తెరిపించావ్- నాకు చక్కని గుణపాఠం నేర్పావ్! ఇకపై మనిద్దరం అన్యోన్యంగ్య అనురాగ దాంపత్యంతో సుఖపడదాం! నన్ను నమ్ము...' భార్యను దగ్గరకు తీసుకుని హృదయానికి గాఢంగ హత్తుకున్నాడు.

ఆక్షణం వరకు ప్రభావతిలో వున్న అసంతృప్తి పటాపంచలైనట్టు ఫీలైంది. మొగుడు పద్ధతులను మార్చుకోగలిగినందుకు ఆమె హృదయం తేలిక పడినట్టయింది

(సాహితీ కిరణం మాసపత్రిక)